టిడ్కో అపార్ట్‌మెంట్స్‌లోని సమస్యలపై ఫిర్యాదు

పీజీఆర్‌ఎస్‌లో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతి



టిడ్కో అపార్ట్‌మెంట్స్‌లో సౌకర్యాలు కల్పించాలని సబ్ కలెక్టర్‌కు విన్నవిస్తున్న స్థానికులు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని నిరుపేదలకు ప్రభుత్వం మంజూరుచేసిన టిడ్కో అపార్ట్‌మెంట్స్‌లో అనేక సమస్యలతో సతమతమవుతున్నామని, మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు, స్థానికులు ఫిర్యాదు చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజాసమస్యలపై సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకప్పకోట పంచాయతీ ఎర్రగానిమిట్ట టిడ్కో అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న ప్రజలు... తమ సమస్యలపై ఏకరువు పెట్టారు. చిన్న సమస్య వచ్చినా ప్రతి విషయానికి 5 కిలోమీటర్ల దూరంలోని పట్టణానికి వెళ్లాల్సి వస్తోందని, స్థానికంగా కనీస వసతులు కల్పించేలా చూడాలన్నారు. పిల్లలకు బడి, రేషన్ సరుకులు, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నామని చెప్పుకొచ్చారు. సమస్యలు పరిష్కరించాల్సిందిగా కోరారు.

- బసినికొండకు చెందిన గాజుల చైతన్యకుమార్ భార్య జి.అంజలి, తాను పుట్టుకతో మూగదానినని, వికలాంగుల కోటా కింద పెన్షన్‌కు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, మంజూరు కాలేదని వాపోయారు. పెన్షన్ మంజూరు చేయాల్సిందిగా అర్జీ సమర్పించారు.
- మొలకలదిన్నె ఎంఎస్ఎంఈలో సేల్ అగ్రిమెంట్ జరిగిన ప్లాట్‌నెంబర్.43ని ఏపీఐఐసీ అధికారులు ఇప్పటివరకు స్వాధీనం చేయలేదని పట్టణంలోని దిగువకమ్మపల్లెకు చెందిన శ్రీ రామా ఇండస్ట్రీస్ ప్రొప్రైటర్ ఎం.పార్వతి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదుచేశారు. తనకు కేటాయించిన ప్లాట్ నెంబర్.43లో స్థానిక రైతులు పౌల్ట్రీ ఫారం నిర్మించుకుని వారి ఆధీనంలో ఉంచుకున్నారని, తనకు మంజూరైన ప్లాట్‌ను తనకు అప్పగించాల్సిందిగా ఏపీఐఐసీ అధికారులను ఆదేశించాలని కోరారు.
- తంబళ్లపల్లె మండలం దబ్బలగుట్ట ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా ముంపుకు గురైన భూమికి సంబంధించి ప్రభుత్వం నుంచి 15 ఏళ్లుగా నష్టపరిహారం అందలేదని కోసువారిపల్లె జొన్నచేనుపల్లెకు చెందిన వై.వెంకటరమణారెడ్డి ఫిర్యాదుచేశారు.
- తట్టివారిపల్లె న్యూ చంద్రారెడ్డి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ స్థానికులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. రోడ్లు, మురుగుకాలువలు, వీధిదీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాత్రివేళల్లో పాముల బెడద అధికంగా ఉందని, కనీస వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- కోళ్లబైలు–1 పంచాయతీ ఇందిరమ్మకాలనీలోని ప్రభుత్వస్థలం సర్వేనెం.614/2, 614/3లో పెట్టిన ఆంజనేయస్వామి విగ్రహాన్ని పక్కన ఉన్నటువంటి పాలేటి గంగమ్మ గుడి ప్రాంగణంలోకి మార్చాలని స్థానికులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు.

నాసిరకం విత్తన కాయలతో పంటల సాగు ఎలా?

- వేరుశనగ రైతులను ఏం చేయాలనుకుంటున్నారు ?
- కురబలకోట మండల మీట్‌లో మండిపడిన ఎంపీటీసీ



మండల మీట్‌లో అధికారులు

కురబలకోట: ఈసారి రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన వేరుశనగ విత్తనకాయలు అధిక భాగం నచ్చులు..పుచ్చులే ఉన్నాయని వీటిని భూమిలో ఎలా వేయాలి..పంట వస్తుందా..ఇంతకూ ఇలాంటి నాసికరం విత్తన కాయలు ఇచ్చి రైతులను ఏం చేయాలని అనుకుంటున్నారని కురబలకోట మండలం కనసానివారిపల్లె వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు ముదివేటి ఆనందరెడ్డి అధికారులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎంజి భూదేవి అధ్యక్షతన మండల మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల సమీక్షలలో భాగంగా వ్యవసాయశాఖ అధికారి వేరుశనగ విత్తన కాయల గురించి మాట్లాడుతుండగా ఒక్కసారిగా ఎంపీటీసీ ఆనందరెడ్డి లేచి పనికి రాని కేసిక్స్ వేరుశనగ విత్తన కాయలను రైతులకు పంపిణీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. 70 శాతం కాయలు బాగలేవన్నారు. ఈ విత్తనాలు తినడానికి కూడా చేదుగా ఉన్నాయన్నారు. కూరలకు కూడా పనికిరాని విత్తనాలున్న కాయలు పంపిణీ చేయడంలో ప్రభుత్వ ఉద్దేశ్యం ఏమిటని నిలదీశారు. అసలు సగం మంది రైతులకు కూడా మండలంలో వేరుశనగ విత్తన కాయలు ఇవ్వలేదన్నారు. అంతేకాదు రైతుకు ఒక్క మూట చొప్పున మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవడం దుర్మార్గంగా ఉందన్నారు. ఇందుకు అధికారులు కూడా నీళ్లు నమిలే పరిస్థితి ఏర్పడింది. ఎంపీటీసీ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయారు. సమావేశంలో జడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీడీఓ గంగయ్య, యాసానుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మా.. కరుణించమ్మా



పుష్పపల్లకీ వాహనంలో ఊరేగుతున్న ఎల్లమ్మ

- సర్వదర్శనానికి పోటెత్తిన భక్తులు
- భక్తులతో కిక్కిరిసిన కలికిరి
- అలరించిన లంకాదహనం
- పుష్పపల్లకీపై విహరించిన అమ్మవారు

కలికిరి: కోరిన కోర్కెలు తీర్చే మాతల్లీ.. ఎల్లమ్మా.. కరుణించమ్మా అంటూ భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. కలికిరి ఎల్లమ్మ జాతరను పురస్కరించుని మూడవ రోజు సోమవారం ఎల్లమ్మ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఊరేగింపుగా విచ్చేసిన భక్తులు చాందినీ బండ్లుతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేశారు. వినూత్న హంగులు, రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణలతో చాందినీ బండ్ల అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఉదయం నుంచి అమ్మవారి సర్వదర్శనం ప్రారంభమైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు భారీ కేడ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లంకాదహనం కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

పుష్ప పల్లకీపై ఎల్లమ్మ

సోమవారం రాత్రి ఎల్లమ్మ పుష్పపల్లకీ వాహనంపై లలిత త్రిపుర సుందరీ దేవి అలంకారంలో కలికిరి పురవీధులలో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన పుష్పపల్లకీ ఊరేగింపు ఆర్‌ఎస్ రోడ్డు, బ్రాహ్మణ వీధి, మెయిన్ బాజారు, రైల్వే బ్రిడ్జి వరకు, తిరిగి ఆలయం వద్దకు సాగింది. ఇంటింటి వద్ద భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు పట్టి, కొబ్బరికాయలు సమర్పించి అమ్మవారి కటాక్షం పొందారు. మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి, నిర్వాహకులు ఆర్.మధుసూదన్ రెడ్డి, ఆర్.సురేంద్రరెడ్డి, ఆర్.యోగేష్ రెడ్డి, అమ్మవారి సేవా వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్ మహిళలకు రక్షణ కవచం



అవగాహన కల్పిస్తున్న శక్తియాప్ టీమ్

పీలేరు రూరల్ : శక్తియాప్ మహిళలకు రక్షణ కవచంగా పని చేస్తుందని మహిళా పోలీస్ శోభారాణి, హెడ్‌కానిస్టేబుల్ దశరథ్ అన్నారు. సోమవారం స్థానిక సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో శక్తియాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తాము ఎదుర్కొంటున్న వేధింపులు నుంచి ఎలా బయటపడాలో అర్థంకాని స్థితిలో ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. శక్తియాప్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని అందులో ఎస్‌ఓఎస్ ఆప్షన్‌పై నొక్కితే పోలీసులు నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకుని రక్షిస్తారని తెలిపారు. ఈ యాప్‌ను మహిళలు, విద్యార్థినులు డౌన్‌లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు రాధాకృష్ణ, నరసింహులు, చంద్రశేఖర్, సంతోష్, జానకి, అజిత, రషీద తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా రమేష్



చల్లా రమేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న నాగరాజు, తదితరులు

కలకడ : రిజర్వేషన్ల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా కలకడ మండలం, నడిమిచెర్ల పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన చల్లా.రమేష్‌ను ఏకగ్రీవంగా ఎంపిచేసినట్లు ఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు నాగరాజు తెలిపారు. సోమవారం మండలంలో జరిగిన రిజర్వేషన్ల పరిరక్షణ సమితి సమావేశంలో ఈమేరకు చల్లా రమేష్‌కు నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా చల్లా రమేష్ మాట్లాడుతూ రిజర్వేషన్ వర్గాల ఐక్యత కోసం, చట్టసభలలో బీసీలకు 44శాతం రిజర్వేషన్ల సాధన కోసం, జనాభా ప్రాతిపదికన కృషి చేస్తానన్నారు. జిల్లాలో సామాజిక న్యాయం కోసం, పేదలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం, బహుజనులను ఐక్యం చేయడానికి మండల కమిటీలు ఏర్పాటు చేసి వెనుకబడిన వారిలో చైతన్యం తీసుకురావడానికి తమ వంతు కృషి చేస్తానన్నారు.

పాతకోనలో నాగపంచమి పూజలు

కలకడ : మండలంలోని కోన పంచాయతీ పాతకోన శివాలయం సమీపంలోని శివపార్వతులు, పుట్టకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం నాగపంచమి సందర్భంగా మహిళలు పుట్టలో పాలుపోసి, తెల్లదారం చుట్టి ప్రత్యేక పూజలు చేశారు. నాగపంచమికి శివాలయం దగ్గర పుట్టకు పూజలు చేయడం ఆనవాయితీ. అషాఢమాసంలోని నాగపంచమి రోజు చేయడం పూజలు చేయడం ద్వారా దోష నివారణ కలుగుతుందని ఆలయ పూజారి విశ్వనాథస్వామి తెలిపారు. పాతకోన శివాలయానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మూర్ఛరోగులకు ఉచితవైద్య శిబిరం

మదనపల్లె సిటీ: మూర్ఛరోగులకు ఈనెల 20వతేదీన స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి తెలిపారు. విజయవాడకు చెందిన జీబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోపాలం శివన్నారాయణ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందుబాటులో ఉంటారన్నారు. మూర్ఛవ్యాధితో బాధపడే వారు వైద్య శిబిరంకు హాజరై ఉచితంగా పరీక్షలు, మందులు తీసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 7799996609, 9440556284ను సంప్రదించాలని కోరారు.

ఏనుగుమల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఏనుగుమల్లమ్మ

తంబళ్లపల్లె: మల్లయ్యకొండకు వెళ్లేదారిలో వెలసిన ఏనుగుమల్లమ్మ ఆలయంలో సోమవారం పూజారులు శేఖర్, విజయకుమారిలు అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మల్లయ్యకొండకు వెళ్లే భక్తులు మొదట ఏనుగు మలమ్మకు పూజ చేస్తారు. మల్లయ్యకొండకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

వక్కంతం చంద్రమౌళికి సన్మానం



చంద్రమౌళిని సన్మానిస్తున్న గ్రామస్తులు

రామసముద్రం: ప్రముఖ వాస్తుశాస్త్ర నిపుణులు వక్కంతం చంద్రమౌళిని సోమవారం ఘనంగా సన్మానించారు. రామసముద్రం మండలం మూగవాడి గ్రామంలో వెలసిన అతిపురాతన శ్రీపుండీశ్వరస్వామి ఆలయంలో వక్కంతం చంద్రమౌళి కుటుంబ సమేతంగా పూజలు చేశారు. మూగవాడి గ్రామానికి చెందిన వక్కంతం చంద్రమౌళి కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించి గ్రామస్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఆయన కలసి చదువుకున్న పూర్వపువిద్యార్థులు, గ్రామస్తులు చంద్రమౌళిని దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కులశేఖర్‌బట్టర్, మహేష్ బద్రినాథ్, హరిప్రసాద్, అన్వర్, రాజేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి రెండోవిడత దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బాలమురళిప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీలోపు విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 22వ తేదీలోపు తమ ఒరిజనల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు హాజరు కావాలని కోరారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా వెల్డర్ కోర్సులకు అర్హులని తెలిపారు. అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

కలికిరి: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎంపిక కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ రియాజ్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా కలికిరి పంచాయతీ ఈఓ అశోక్, ఉపాధ్యక్షులుగా నవాజుల్లా, వి.గంగాదేవి, కోశాధికారిగా జి.గిరి, మీడియా కార్యదర్శిగా తనూజ, ప్రధాన కార్యదర్శిగా గోపి, కార్యవర్గ సభ్యులుగా బి.తిమ్మారెడ్డి, సాయిక్రిష్ణ, మౌనిక, జెనిఫా, మునిరాజా, రామ్మూర్తి నాయుడు ఎంపికయ్యారు.

ఘనంగా సంకటహర చతుర్థి

మదనపల్లె సిటీ: స్థానిక బెంగుళూరురోడ్డులోని శ్రీయోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థి నిర్వహించారు. ఆలయంలోని గణపతికి విశేషంగా అభిషేకాలు చేశారు. యోగభోగే శ్వరుడికి అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ ప్రత్యేక అలంకరణ చేసి పూజలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కేవీపల్లె : ప్రకృతి వ్యవసాయంతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని వ్యవసాయాధికారి మాధవి అన్నారు. సోమవారం మండలంలోని మంచాలమందలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని కోరారు. రసాయనిక ఎరువులకు బదులుగా జీవన ఎరువులు, క్రిమిసంహారక మందులకు వేపనూనె కషాయాలను వాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోదేషావలి, సీఆర్ఈ సంస్థ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ప్రహ్లాద, రైతులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



చిన్నపిల్లను పరీక్షిస్తున్న డాక్టర్ రామిరెడ్డి

తంబళ్లపల్లె: చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని మదనపల్లె ఆర్‌ఆర్ హాస్పిటల్ చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. స్థానిక పాతకళాశాల మైదానంలో సోమవారం చిన్నిపిల్లల వైద్యశిబిరం నిర్వహించారు. చిన్నపిల్లలకు ప్రత్యేక వైద్య చికిత్సలు చేసి జలుబు, దగ్గు వంటి వ్యాధులకు ఉచితంగా పరీక్షలు,మందులు పంపిణీ చేశారు. సుమారు 67 మంది చిన్నిపిల్లలకు వైద్యచికిత్సలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శృతి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపుండీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీపుండీశ్వరస్వామి

రామసముద్రం: మండలంలోని మూగవాడి గ్రామంలో వెలసిన శ్రీ పుండీశ్వరస్వామికి సోమవారం ఆషాఢమాసం సందర్భంగా పంచామృత, రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రమేష్‌దీక్షిత్ స్వామి అమ్మవార్లకు విశేషాలంకరణ చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బుద్ధ విగ్రహ ధ్వంసం కుట్రను బహిర్గతం చేయాలి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



బుద్ధునికొండలో ధ్వంసం చేసిన విగ్రహం వద్ద నిసార్‌అహ్మద్, నాయకులు

మదనపల్లె రూరల్ : బుద్ధునికొండలో విగ్రహాల ధ్వంసం అత్యంత హేయమైన చర్య అని, దీని వెనుక ఉన్న కుట్రను పోలీసులు, ప్రభుత్వ పెద్దలు బహిర్గతం చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం అంకిశెట్టిపల్లె పంచాయతీలోని బుద్ధునికొండను, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి నిసార్‌అహ్మద్ సందర్శించారు. ధ్వంసం చేసిన బుద్ధుడి విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటుచేసిన బుద్ధ విగ్రహాలు పట్టణానికే తలమానికంగా ఉంటే, ధ్వంసం చేసేందుకు దుండగులకు చేతులు ఎలా వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. బుద్ధునికొండపై విగ్రహాల ఏర్పాటు, విద్యుత్, నీరు, రోడ్లు, భూమి చదును కోసం ఎంతో శ్రమించిన బుద్ధవిహార్ వ్యవస్థాపకులు పీటీఎం.శివప్రసాద్, బాస్ నాయకుల కృషిని ప్రశంసించారు. బుద్ధునికొండపై విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించడంలో స్థానిక పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. బుద్ధునికొండలో విగ్రహాల ధ్వంసం వెనుక, ఏమైనా స్వార్థ ప్రయోజనాలు దాగి ఉన్నాయా..? లేక కొండను ఆక్రమించుకునేందుకు చేస్తున్న చర్యలా..? పోలీసులు నిగ్గు తేల్చాలన్నారు. ప్రపంచంలో శాంతిని కోరుకునే ఏకైక మతం బౌద్ధమతమని, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ బుద్ధుడిని పూజిస్తారన్నారు. రాష్ట్రప్రభుత్వం అమరావతికి బ్రాండ్ అంబాసిడర్‌గా బుద్ధుని ఎంచుకోవడానికి ఇదే కారణమన్నారు. అలాంటి మహనీయుడిని భావితరాలు గుర్తుంచుకునేందుకు బుద్ధ విగ్రహాలు ఏర్పాటుచేస్తే వాటిని ధ్వంసం చేయడం తగదన్నారు. బుద్ధునికొండపై స్మారక చిహ్నం ఏర్పాటుచేసి, ప్రభుత్వమే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ప్రసాద్‌బాబు, ఈశ్వర్‌నాయక్, నాయకులు పూజారి చరణ్, కొత్తపల్లె మహేష్, రహీం, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి

- ప్రజాసంఘాల నాయకులపై తప్పుడు కేసులు ఎత్తివేయాలి
- ఉద్యమకారులపై రాజ్యాంగ వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న జిల్లా ఎస్పీ
- బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు



నిరసన తెలుపుతున్న బహుజనసేన సభ్యులు

మదనపల్లె రూరల్ : మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ బుద్ధునికొండలో బుద్ధ విగ్రహాలపై పలుమార్లు దాడులకు పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ని కలిసి, బుద్ధ విగ్రహం ధ్వంసం ఘటనలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదుచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఐదురోజుల క్రితం బుద్ధునికొండలో బుద్ధ విగ్రహంను ధ్వంసం చేసి, తలను తొలగించిన దుండగులను గుర్తించి శిక్షించడంలో తాలూకా సీఐ కళావెంకటరమణ విఫలమై, నిరసన వ్యక్తం చేస్తున్న వారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. పోలీసులు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పట్టుకోవడంలో విఫలమయ్యారని, జిల్లా ఎస్పీ సొంత రాజ్యాంగాన్ని అమలుపరుస్తూ, నానాహైరానా పెట్టిస్తున్నారన్నారు. ఎస్పీ దుశ్చర్యలపై కర్నూలు రేంజ్ డీఐజీకి ఫిర్యాదుచేశామన్నారు. మదనపల్లె పోలీసుల ఆగడాలు ఇలాగే కొనసాగితే..ఈనెల 28న ఛలో మదనపల్లె కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలను, దక్షిణాది రాష్ట్రాల నాయకులను ఆహ్వానించి పోలీసుల తీరును ఎండగడతామని హెచ్చరించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, సీఐ కళావెంకటరమణలపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. తక్షణమే పోలీసు యంత్రాంగం ఈకేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దుండగులను పట్టుకుని శిక్షించి, భవిష్యత్తులో విగ్రహాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బహుజనసేన నాయకులు గిన్నెల మనోహర్ రెడ్డి, బాస్ నాయకులు ముత్యాలమోహన్, బురుజు రవిశంకర్, చాట్లబయన్న, శేఖర్, రాఘవేంద్రయాదవ్, బ్యాంకు శీన, కుమ్మహరిబాబు, జయశంకర్, నర్సింహులు, భానుప్రకాష్, రెడ్డిశేఖర్, నరేష్, బురుజురెడ్డిప్రసాద్, పలక ఆనంద్ పాల్గొన్నారు.

మంచి ర్యాంకు పొందేందుకు కష్టపడాలి



మెటీరియల్ అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు

నందలూరు : స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ర్యాంకు పొందేందుకు కష్టపడాలని అధ్యాపకులు సూచించారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపల్లె బాలికల జూనియర్ కళాశాల (హైస్కూల్ ప్లస్)లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థినులకు సోమవారం సాయంత్రం ప్రధాన ఆచార్యులు (ఎఫ్‌ఏసీ) గంగనపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో ఈఏపీసెట్‌తోపాటు నీట్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

కడప - బెంగళూరు రైల్వే లైన్ పూర్తి చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : కడప – రాయచోటి – మదనపల్లె – బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి బహిరంగ లేఖ రాశారు. సోమవారం రాయచోటి పట్టణంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ లేఖను సీఎంకు మెయిల్ ద్వారా పంపినట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంత రైతులు, వినియోగదారులు, ప్రజల సమగ్రాభివృద్ధి కోసం 2008 – 09 రైల్వే బడ్జెట్‌లో రైలు మార్గం మంజూరైందని తెలిపారు. రైలు మార్గం పొడవు 255.40 కిలోమీటర్లు కాగా 50 శాతం కేంద్రం, 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు భరించే షరతులతో మంజూరైందని చెప్పారు. అనంతరం జరిగిన పలు పరిణామాల వల్ల రైల్వే లైన్ పనులు ఆగిపోయాయని అన్నారు. రాయలసీమ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రైల్వే లైన్ పనులు పూర్తి చేయడానికి నిధులు మంజూరునకు కృషి చేయాలని ఆయన కోరారు.

మూలుగుతున్న నిధులకు మోక్షమెప్పుడో ?

- పైసా బిల్లులు పెట్టని ఎంపీడీఓ
- నలిగిపోతున్న కింద స్థాయి అధికారులు

పెద్దతిప్పసముద్రం: మండల అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న అబ్దుల్ కలాం ఆజాద్ రూటే సపరేటు. ఆయన ఇక్కడ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టి తొమ్మిది నెలలైంది. గతంలో రెండు, మూడు సార్లు మండల్ మీట్‌లో సభ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించేలా సభ్యులందరూ తీర్మానించగా ఎంపీపీ ఆమోదించారు. ప్రధానంగా మండలంలో 12 కొత్తగా తాగునీటి బోర్లు, పైప్‌లైన్, మోటార్లు, పైపులు లాంటి పనులను పూర్తి చేశారు. ఏడాది క్రితం మండల గ్రాంట్‌లో రూ.75 లక్షల దాకా నిధులు ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాకా మంజూరైన నిధులన్నీ కలుపుకుంటే రూ.కోటికి పైగా ఉండవచ్చని పలువురు సభ్యులు పేర్కొంటున్నారు. అయితే ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల గ్రాంట్ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సదరు ఎంపీడీఓ ఇక్కడ విధుల్లోకి చేరినప్పటి నుంచి ఇంత వరకు ఏ పనికి కూడా నయా పైసా బిల్లు కూడా పెట్టకపోవడం శోచనీయం. ఆఖరికి ఎంపీపీ, ఎంపీటీసీల జీతాలు కూడా ఎందుకు పెట్టలేదో ఆయనకే ఎరుక. పూర్తయిన పనులకు సంబంధించి తంబ్ వేయండి సార్ అని పలువురు కింది స్థాయి అధికారులు ఎంపీడీఓను విన్నవించగా ఆయన నిర్లక్ష్యం వహిస్తూ పొంతనలేని సమాధానాలతో కాలయాపన చేయడం గమనార్హం. నెలల తరబడి బిల్లులు మంజూరు కానందున బోరు డ్రిల్లర్ల యజమానులు, మోటారు,పైపుల డీలర్ల తీవ్రమైన ఒత్తిళ్ల కారణంగా ఆర్‌డబ్ల్యూస్ అధికారులు నలిగిపోతున్నట్లు సమాచారం. అయితే రూ.లక్షల నిధులు మూలుగుతున్నా సుమారు ఏడాది నుంచి మండల గ్రాంట్ ద్వారా నయా పైసా కూడా ఎందుకు ఖర్చు చేయలేదంటూ జెడ్పీ సీఈఓ ఇటీవల చిత్తూరులో జరిగిన సమావేశంలో ఎంపీడీవోను ప్రశ్నిస్తూ మండిపడినట్లు సమాచారం. అంతేగాక ఎంపీడీవో కార్యాలయానికి ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్ళిపోతారో కూడా తెలియని పరిస్థితి. అయితే వారం రోజుల నుంచి బిల్లుల కోసమని వెళ్ళిన వారికి డీపీవో కొత్తగా వచ్చారు, ప్రభుత్వ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వారి ఆధార్ అథెంటికేషన్ పూర్తయిన వెంటనే తంబ్ వేసేస్తానని ఎంపీడీవో చెబుతున్నా అధికారులకు నమ్మశక్యం కలగలేదు. మూడు నెలల్లో రిటైర్డ్ అయ్యే తనకు లేనిపోని సమస్యలు తనకెందుకులేనని ఎంపీడీవో భావిస్తున్నట్లు వినికిడి. అప్పటి వరకు మండల గ్రాంట్‌లోని నిధులను ప్రభుత్వం వేరే సంక్షేమ పథకాలకు బదలాయించేస్తే పెండింగ్ బిల్లుల పరిస్థితి ఏంటోనని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యతో తప్పని అవస్థలు

మదనపల్లె సిటీ: డివిజన్‌కేంద్రమైన మదనపల్లె పట్టణంలో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. పెరుగుతున్న జనాభా, అదే స్థాయిలో వాహనాలతో నిత్యం రద్దీ నెలకొంటోంది. ఇటీవల వగలుతో పాటు సాయంత్రమైతే చాలు ప్రధాన కూడళ్లల్లో వాహనాలు బారులు తీరి నిలిచిపోతున్నాయి. దీంతో సాయంత్రం పట్టణంలోకి వెళ్లాలంటే వాహనచోదకులు జంకుతున్నారు. ప్రధానంగా ఎన్టీఆర్ సర్కిల్‌లో ఇటీవల ఓ చికెన్ షోరూం ప్రారంభించడంతో వాహనాలు రోడ్లుపైనే నిలిచిపోతున్నాయి. కొనుగోలుదారులు వాహనాలు రోడ్లుపై నిలిపివేస్తున్నారు. దీంతో బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోతున్నాయి. షాపు వద్ద వాహనాల పార్కింగ్ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. వాహనాలు రోడ్లపైనే అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీనికితోడు హైదరాబాదుకు వెళ్లే ప్రైవేటు బస్సులు మున్సిపల్ కార్యాలయం నుంచి నీరుగట్టువారిపల్లె వరకు ఎక్కడపడితే అక్కడ నిలిపి వేస్తుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. సీటీఎం రోడ్డు, నిమ్మనపల్లె క్రాస్, నీరుగట్టువారిపల్లెలో కూడా ట్రాఫిక్ నియంత్రణకు చర్యల చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.